పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు

- ఎట్టకేలకు నిర్ణయం
- దశలవారీగా విచారణ
- వచ్చే వారం నుంచే..!



ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురికి శుక్రవారం అధికారికంగా నోటీసులు పంపారు. వీరి విచారణ ముగిసిన తర్వాత మరికొందరికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. వచ్చే వారం నుంచి వీరి విచారణ ప్రారంభమవుతుందని సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారనీ, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత జులై 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానిపై అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించారని సమాచారం. ఆ తర్వాతే ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, టి ప్రకాశ్‌గౌడ్, కష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారందరికీ నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకొన్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. స్పీకర్ నోటీసుల నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏం చేస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఎమ్మెల్యేల్లోనూ చర్చ జరుగుతున్నది.

నోటీసులు అందాయి : కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కష్ణమోహన్‌రెడ్డి తనకు నోటీసులు అందాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్టు చెప్పారు. నోటీసుపై న్యాయనిపుణులతో మాట్లాడి వివరణ ఇస్తానన్నారు. తాను అసలు పార్టీ మారలేదనీ, సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని గుర్తు చేశారు. గద్వాల నియోజకవర్గ అభివద్ధి కోసమే తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. ఇప్పటికీ తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని వివరించారు. నోటీసులు జారీచేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, దానికి సంబంధించిన ప్రక్రియను చేపట్టాలని అసెంబ్లీ కార్యదర్శి నరసింహ్మాచార్యులను ఆదేశించారు.



ఆడపిల్లలపై కొనసాగుతున్న అణచివేత

- రాష్ట్ర సదస్సులో పిఓడబ్ల్యు జాతీయ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆడపిల్లలపై కుటుంబం, సమాజం నుంచి అణచివేత కొనసాగుతోందని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకులు ఝాన్సీ, సంధ్య, రాష్ట్ర అధ్యక్షులు అనసూయ తెలిపారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) దేశవ్యాప్త నేషనల్ కోఆర్డినేషన్ పిలుపులో భాగంగా శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో 'మహిళల అధికారం హక్కుకై పోరాడుదాం' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ.. తమ జీవితాల్లో ముఖ్యమైన నిర్ణయాలను తీసుకునే హక్కు.. స్వేచ్ఛ సమానత్వపు హక్కులో భాగమే అయినా.. మన దేశంలో కుల, మత, కుటుంబ కట్టుబాట్లు, పరువు పేరుతో ఆడపిల్లలపై అణచివేత కొనసాగుతోందన్నారు. ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా సంపాదనా పరులైన మహిళలు కూడా కుటుంబం, తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్న సందర్భాల్లో క్రూరంగా హత్యలకు గురవుతున్న ఘటనలు చూస్తున్నామన్నారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో రాధిక యాదవ్ ఉదంతం దీనికి ఉదాహరణ అన్నారు. అంతర్జాతీయంగా 113, జాతీయంగా ఐదో ర్యాంకులో ఉన్న టెన్నిస్ క్రీడాకారిణి రాధిక యాదవ్(21) తన అభిరుచికి అనుగుణంగా టెన్నిస్ కోచింగ్ ఇస్తున్నందుకు కన్న తండ్రి చేతిలో తుపాకీతో కాల్చి హత్య చేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేరళ, తిరుపతి, కడప, ఖమ్మం జిల్లాలోని యువతుల మరణాలు మర్చిపోలేనివన్నారు. కులాల, మతాలకతీతంగా వివాహాలు చేసుకున్న ఆడపిల్లలను కుటుంబ సభ్యులే హత్య చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మ పునరుజ్జీవన పేరిట వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నారని, మహిళలపై నేరస్తుల ముద్ర వేసి బాధితులకే శిక్షలు విధించే పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. పోలీస్ రంగం, న్యాయ వ్యవస్థ కూడా మహిళా రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయకుండా.. వారినే నిందితులుగా చూపిస్తున్నారని తెలిపారు. సంధ్య మాట్లాడుతూ.. దేశ జనాభాలో సగం మహిళలే అని, వారు ఉత్పత్తి కార్యక్రమాలు, ఉద్యోగ ఉపాధి రంగాల్లో సమాన భాగస్వాములుగా నిలిచినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు అనసూయ మాట్లాడుతూ.. మహిళలు ఐక్యంగా స్వేచ్ఛ, సమానత్వం, సమాన ప్రాతినిధ్యం కోసం పోరాడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంగ, కార్యకర్తలు అంబిక, భండారు విజయ, జ్యోతి, కె.సత్యవతి, ఐఎఫ్‌టియు అనురాధ, జానకి, ఊకె పద్మ, పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎక్కడ చూసినా చెత్తే...

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడ చూసినా పారిశుద్ధ్య లోపం కనిపిస్తోందని, ప్రభుత్వం దీని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ సహా పల్లెల దాకా ఎక్కడ చూసినా చెత్తే కనిపిస్తోందన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో ఇంతటి దుర్గంధభరిత పరిస్థితులు ఎన్నడూ లేవన్నారు. పంచాయతీలకు చెత్త సేకరణకు ఇచ్చిన ట్రాక్టర్లకు డీజిల్ లేక సరెండర్ చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలై సమ్మె బాట పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికలు పెట్టలేదు కనుక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు గ్రామాలకు రావడం లేదని గుర్తు చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేంద్రం పరిధిలో ఉన్నాయని తెలిసి కాంగ్రెస్ మోసపూరిత మాటలు చెప్పిందని గుర్తు చేశారు.

సమాజ మార్గనిర్దేశకుడు షోయబుల్లాఖాన్

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం నిరంకుశ ప్రభుత్వానికీ, ఖాసీం రజ్వీ సైన్యం దుర్మార్గాలను, లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఇమ్రోజ్ పత్రికలో తన కలం ద్వారా పోరాటం చేసిన సమాజానికి మార్గనిర్దేశం చేసి గొప్ప పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా బిజెపి తరపున, తెలంగాణ తరపున ఘన నివాలర్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 17న ఈ ఏడాదీ కేంద్ర ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో వీధి లైట్ల కోసం కార్పొరేటర్లు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. జిహెచ్ఎంసిలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు.

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు యూరియా సరఫరా చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్టుందని ఎద్దేవా చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టింది అబద్ధం కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంపిల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి ఆ పార్టీకి సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పరిపాలన చేయటమంటే బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదని ఎద్దేవా చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని, రైతులకు రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తు చేశారు.

యువత నైపుణ్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగావకాశాల విస్తరణ, యువతకు నైపుణ్యాభివృద్ధి, విదేశీ ఉపాధి అవకాశాలపై ఉన్న స్థితిపై మంత్రి వివేక్ వెంకటస్వామి సమీక్షించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో లేబర్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖ అధికారులతో టిఓఎంసిఓఎం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రతి ఉద్యోగార్థికి సహకారం అందేలా కృషి చేయాలని ఆదేశించారు.

జూరాల 44 గేట్లు ఎత్తివేత

- నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

హైదరాబాద్ బ్యూరో : జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నుంచి ఎగువ ప్రాంతం నుంచి 4 లక్షల 8వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దాం 44 గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయంలోకి 4 లక్షల 18 వేల 912 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల నీటిమట్టం సామర్థ్యం 9.965 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 6.695 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడికాలువకు 470 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు.

ప్రిన్సిపాల్‌పై కోపంతో విద్యార్థులపై విష ప్రయోగం

- నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన టీచర్
- అస్వస్థతకు గురైన 11మంది విద్యార్థులు
- భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులను భావిభారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు వక్రబుద్ధి ప్రదర్శించాడు. ప్రిన్సిపాల్‌తో ఉన్న అంతర్గత వివాదంతో పాఠశాలలోని తాగునీటి ట్యాంకులో పురుగుల మందు కలిపాడు.. ఆ నీటిని తాగిన విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. అత్యంత దారుణమైన ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. పూర్తి వివరాలిలా ఉన్నాయి..

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ మధ్య కొద్దిరోజులుగా వివాదం నడుస్తోంది.. ప్రిన్సిపాల్‌పై కోపంతో సైన్స్ టీచర్ కుట్ర పన్ని తాగునీటి ట్యాంకులో పురుగుల మందు కలిపాడు. ఆ నీటిని తాగిన 11మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం టిఫిన్ తిన్న తరువాత వారంతా వాంతులు చేసుకున్నారు. వెంటనే సిబ్బంది విద్యార్థులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదుతో కలెక్టర్‌తో పాటు ఎస్పి విచారణ చేపట్టారు. నీటిలో సైన్స్ టీచర్ రాజేందరే పురుగుల మందు కలిపినట్టు విద్యార్థులు కలెక్టర్‌కు, ఎస్పికి తెలిపారు. పాఠశాలలోని ఆర్ఓ ప్లాంట్‌కు సంబంధించిన కెమికల్స్ ద్వారా తాగునీరు ఏమైనా కలుషితమైందా అని తెలుసుకునేందుకు డిఎంహెచ్ఓ పాఠశాలను సందర్శించారు. తాగునీటిని బాటిల్‌లో తీసుకుని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. మంచినీళ్ల ట్యాంక్‌లో ఉపాధ్యాయుడు రాజేందర్ పురుగుల మందు కలిపినట్టు గుర్తించారు. రాజేందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

నలుగురిపై సస్పెన్షన్

తాగునీటిలో పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయుడు రాజేందర్‌తోపాటు వేణు, సూర్యప్రకాశ్, వంట మనిషి రాజేశ్వరిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. విభేదాలతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి హాస్టల్‌ను ప్రత్యేక అధికారులు, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేసి విద్యార్థులతో ముఖాముఖి కావాలని, వారి సమస్యలను తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రధాన ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ఎస్పి కిరణ్ ఖరే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం ఉదయం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 24 గంటలు వైద్య సేవలు అందించాలని, పర్యవేక్షణ ఉండాలని వైద్యాధికారులను కోరారు. హాస్టల్‌ను పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఇఒ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లెక్క తేలిన చెన్నూర్ ఎస్‌బిఐ లావాదేవీలు

- 20 కిలోల బంగారం, 1.10 కోట్ల నగదు మాయం
- ప్రధాన నిందితుడి కోసం గాలింపు
- మరో పది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెన్నూర్ బ్రాంచ్-2లో డబ్బుల గోల్‌మాల్ వ్యవహారంలో అసలు లెక్క తేలింది. మూడు రోజులుగా ఆడిట్ చేసిన అధికారులు చివరకు భారీ మొత్తంలో బంగారం, నగదు మాయమైనట్టు గుర్తించారు. శనివారం బ్యాంకు అధికారుల ద్వారా ఫిర్యాదు అందుకున్న చెన్నూర్ సిఐ దేవేందర్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిందితులను పట్టుకునేందుకు నిఘా బృందాలను రంగంలోకి దించారు. ప్రధాన నిందితునిగా భావిస్తున్న బ్యాంకు క్యాషియర్ రవీందర్‌తోపాటు మరో 10 మంది అనుమానితులపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. దాదాపు రూ.12 కోట్ల 61 లక్షల విలువ గల 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.కోటి 10 లక్షలు మాయమైనట్టు బ్యాంకు అధికారులు లెక్కతేల్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 450 మంది ఖాతాదారులు బంగారం తాకట్టు పెట్టుకోగా.. గోల్‌మాల్ వ్యవహారం బయటపడటంతో వారంతా ఇప్పుడు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కష్టపడి దాచుకున్న సొమ్ము మాయం కావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఖాతాదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసులు భరోసా ఇస్తున్నారు. ప్రధాన నిందితుడైన క్యాషియర్ రవీందర్ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

డబ్బులు, బంగారం మాయం

మూడ్రోజులు పాటు ఆడిట్ జరిపిన అధికారులు ఇంత పెద్దమొత్తంలో మోసం జరగడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ ఎస్‌బిఐ-2లో ఆడిట్ చేపట్టిన అధికారులు ముందుగా 2.5 కిలోల బంగారం, రూ.80 లక్షలు మాయమైనట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఆ తర్వాత 3 రోజులు పూర్తి ఆడిట్ చేపట్టాక సుమారు కోటి 10 లక్షల నగదుతోపాటు 20 కిలోల బంగారం మాయమైనట్టు లెక్కతేల్చారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులు చెన్నూర్ సిఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి గెస్ట్ లెక్చరర్ల సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 12 ఏండ్లుగా పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను యథావిధిగా కొనసాగించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్యను శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ కలిసి వినతిపత్రం అందజేశారు. గత విద్యాసంవత్సరంలో టిజిపిఎస్‌సి ద్వారా రెగ్యులర్ లెక్చరర్లు నియామకమయ్యారని వివరించారు. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో వారి సర్వీసులను పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. మంత్రులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ సమస్యను తీసుకుపోయామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి రెగ్యులర్ లెక్చరర్ల నియామకమైనా ఏండ్లుగా పనిచేస్తున్న వారెవరికీ ఇబ్బంది కలగనీయబోమనీ, అందరినీ కొనసాగిస్తామనీ, అవసరమైతే అదనపు పోస్టులను మంజూరు చేస్తామంటూ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో హామీ ప్రకారం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 12 ఏండ్లుగా పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని కోరారు. సిఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఇంటర్ బోర్డు కార్యదర్శి జూన్ 13న ప్రభుత్వ ఆమోదం కోసం 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలంటూ ఆర్థిక శాఖ అధికారులకు పంపించారని తెలిపారు. వివిధ కారణాలు చూపి పోస్టుల సంఖ్యను తగ్గించి కేవలం 398 పోస్టులకు మాత్రమే అనుమతి ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అదే జరిగితే దాదాపు 1,300 మంది గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే అంశాన్ని కృష్ణ ఆదిత్య దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలంటూ ప్రతిపాదనలు పంపామని ఆయన వివరించారని పేర్కొన్నారు. వివిధ కారణాలు చూపి 398 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినట్లు తెలిపారన్నారు. కొందరు మంత్రుల సూచన మేరకు గెస్ట్ లెక్చరర్లకు న్యాయం జరిగేలా 1,256 పోస్టులు అవసరముందంటూ మరో ప్రతిపాదన పంపించామని వివరించారు. తప్పకుండా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కోడి మహేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు కె.వెంకటేష్, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పని

- పేదల ఇళ్లు కూల్చబోం..
- ప్రజాప్రతినిధుల ఫామ్ హౌస్‌లను సైతం కూల్చేశాం
- హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"హైడ్రా రాజకీయాలకతీతంగా పనిచేస్తోంది. ఇది ఒకటి రెండేండ్లకు పరిమితం కాదు.. వందేళ్ల ప్రణాళికతో ముందుకెళ్తోంది.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.." అని హైడ్రా కమిషనర్, ఐజి ఎవి.రంగనాథ్ స్పష్టం చేశారు. వ్యక్తుల ప్రయోజనాలకన్నా ప్రజల ప్రయోజనాలకు మాత్రమే హైడ్రా ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరో చెప్పారని గుడ్డిగా నమ్మి పనిచేయదని అన్నారు. అన్ని అంశాలపై పూర్తిగా అధ్యయనం చేశాక ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. కొన్ని సందర్భాల్లో మేధావులు, నిపుణులతో రాత్రి 11 గంటల వరకు చర్చించిన రోజులున్నాయని తెలిపారు. హైడ్రా ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో 'మహానగర అభివృద్ధి- ఆటంకాలు' అనే అంశంపై టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో శనివారం 'మీట్ ది ప్రెస్' నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో.. హైడ్రాపై ప్రజల్లో నెలకొన్న అపోహలు, వివాదాలు, అనుమానాలను కమిషనర్ ఎవి.రంగనాథ్ నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. మొదట్లో ఏ సంస్థకైనా ఒడుదుడుకులు తప్పవని, హైడ్రా కూడా అనేక అవరోధాలు, విమర్శలను ఎదుర్కొంటూ ఏడాది కాలంగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల్లో హైడ్రా పట్ల నమ్మకం పెరిగిందనడానికి కూకట్‌పల్లి నల్లచెరువు నిదర్శనమని తెలిపారు. విపత్తుల నుంచి నగర ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైడ్రాలో ప్రస్తుతం 200 మంది సిబ్బంది వరకు పనిచేస్తున్నారని తెలిపారు. కొన్ని నిర్ణయాలు కఠినంగా ఉన్నా.. వాటి ఫలితాలు భవిష్యత్‌లో బాగుంటాయని, కబ్జాదారుల నుంచి నగరాన్ని కాపాడి రాబోయే తరాలకు మంచి వాతావరణం, అభివృద్ధిని అందిస్తామన్నారు. హైడ్రా పనితీరుతో ప్రతి ఒక్కరిలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లపై అవగాహన వచ్చిందన్నారు. పార్కులు, నాలాలు, చెరువులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆ తర్వాత ప్రభుత్వ భూములు, లేఆవుట్స్, ఎన్‌క్రోచ్‌మెంట్స్‌పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు కోట్లు విలువచేసే 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను కాపాడామని, ప్రస్తుతం ఆరు చెరువులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సిఎస్ఆర్ పేరుతో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని చెప్పారు. 50 ఎకరాలున్న చెరువు 12 ఎకరాలు అయిందని, అదే తరహాలో నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని చెరువులకూ సాంకేతిక ఆధారాలతో ఎఫ్‌టిఎల్ మార్కు చేస్తున్నామని, నాలాలను నోటిఫై చేస్తున్నామని చెప్పారు. ఫాతిమా కాలేజీనా.. మల్లారెడ్డి కాలేజీనా.. ఇంకోటా అనేది చూడమని, ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

2015 - 2016లో ఫాతిమా కాలేజీ కట్టారని, ఆ సమయానికి అక్కడున్న చెరువుకు ప్రాథమికంగా ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ నిర్ధారణ కాలేదన్నారు. ఫాతిమా కాలేజీ ఏర్పాటు తర్వాత అక్కడ బస్తీలు, నివాస గృహాలు నిర్మాణమయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 80శాతం చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ అయింది కానీ ఫైనల్ నోటిఫికేషన్ కాలేదన్నారు. కొద్ది నెలల్లోనే నగరంలోని అన్ని చెరువులకు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను సైంటిఫిక్‌గా హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ చేస్తామన్నారు. హైడ్రా ఏర్పడిన తర్వాత అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. హైడ్రా రాకముందు నిర్మాణాలు, పర్మిషన్లు తీసుకుంటే వాటి జోలికెళ్లబోమని స్పష్టం చేశారు. పేదల ఇండ్లను కూల్చబోమన్నారు. తప్పని పరిస్థితుల్లో కూల్చివేస్తే అన్ని విధాలా విచారించి ప్రభుత్వం నష్టపహారం చెల్లిస్తుందన్నారు. కూకట్‌పల్లిలో షెడ్స్‌ను మాత్రమే కూల్చేశామన్నారు. ఎవరైనా తమకు అన్యాయం జరిగిందని భావిస్తే కోర్టుకెళ్లొచ్చని సూచించారు. ఎన్ కన్వెన్షన్‌పై చెరువుకు ఫైనల్ నోటిఫికేషన్ కావడంతోనే కూల్చేశామని చెప్పారు. జయభేరీ లేఆవుట్‌లో పార్కులు, రోడ్లు, ఇతర వాటికి మొదట్లో స్థలాలను కేటాయించి, ఆ తర్వాత కబ్జా చేశారన్నారు. వాటిపై ఫిర్యాదులు అందడంతోనే అక్కడ కూల్చివేతలు జరిపామని చెప్పారు. గండిపేట్‌లో సైతం ప్రజాప్రతినిధుల ఫామ్‌హౌజ్‌లు, స్థలాలను కూల్చేశామన్నారు. ఎవరూ అపోహలకు వెళ్లకుండా రాబోవుతరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, టియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ పాల్గొన్నారు.

యూరియా కోసం రేపు ధర్నాలు

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు సకాలంలో యూరియా అందించాలంటూ సోమవారం మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపునిచ్చింది. పంటల సాగు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఒక బస్తా యూరియా కోసం రైతులు రోజంతా క్యూలో నిలబడాల్సి వస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంత రావు, పశ్యపద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటాలో దాదాపు మూడు లక్షల టన్నుల యూరియా సరఫరా కాలేదని తెలిపారు. యూరియా కొరతను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని సత్వరమే పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు కోరారు.

హెల్తీ పెట్స్ జంతువుల ఆస్పత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మందుల నిల్వకు, అమ్మకానికి అవసరమైన డ్రగ్ లైసెన్స్ లేకుండా హెల్తీ పెట్స్ జంతువుల ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం, గుండ్లపోచంపల్లి గ్రామంలోని సదరు ఆస్పత్రిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లైసెన్స్ లేకుండా రూ.60 వేల విలువైన మందులను అమ్మకానికి నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఇందులో ఐదు రకాల ఫిజీషియన్ శాంపిల్స్ కూడా ఉన్నాయి. దీనికి సంబంధించి విచారణ కొనసాగుతుందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డిజి షానవాజ్ ఖాసిం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైల్వే పనులు తనిఖీల పురోగతిని సమీక్షించిన జిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ డివిజన్‌లో జరుగుతున్న పనులను దక్షిణ రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు. ముద్కేడ్ - సికింద్రాబాద్ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీ చేసి, రైలు పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, వంతెనలు, కీలక రైల్వే స్టేషన్ల భద్రతా అంశాలను సమీక్షించారు. బాసర రైల్వే స్టేషన్‌లో పలు సౌకర్యాలు, బాహ్య ప్రదేశాల ఏరియాను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని జిఎం సమీక్షించారు. అనంతరం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన జీఎం, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ పనుల పురోగతిని, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, స్టేషన్ వెలుపల సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించారు. నాందేడ్ రైల్వే స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిఎం వెంట హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ, ఇతర సీనియర్ అధికారులున్నారు. జిఎం పర్యటన సందర్భంగా వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కూలీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



స్వరోవ్‌స్కి బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక

హైదరాబాద్ : ప్రముఖ లగ్జరీ ఆభరణాలు, గడియారాల ఉత్పత్తుల కంపెనీ స్వరోవ్‌స్కి తమ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా నటి రష్మిక మందన్‌ను నియమించుకుంది. ఆమె ఆకర్షణీయమైన వ్యక్తిత్వం స్వరోవ్‌స్కి గ్లామర్‌తో సరిగ్గా సరిపోతుందని ఆ కంపెనీ ఇండియా జిఎం నాస్ స్లీమాన్ పేర్కొన్నారు.

ముగిసిన సిఎల్‌ఎఫ్‌ఎంఎ సింపోజియం

హైదరాబాద్ : కాంపౌండ్ లైవ్‌స్టాక్ ఫీడ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సిఎల్‌ఎఫ్‌ఎంఎ) ఆఫ్ ఇండియా తన 58వ వార్షిక సాధారణ సమావేశం, 66వ జాతీయ సింపోజియం విజయవంతంగా ముగిసిందని ఆ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 22-23 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో 'భారతదేశంలో పశువుల వ్యవసాయం - భవిష్యత్ మార్గం' అంశంపై నిపుణులు చర్చించారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో వ్యవసాయ ఎగుమతులు, గ్రామీణ జీవనోపాధి, ప్రపంచ నాయకత్వంపై నిపుణులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఎల్‌ఎఫ్‌ఎంఎ చైర్మన్ దివ్య కుమార్ గులాటి, కన్వీనర్ విజయ్ డి.భండరే పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 'ఎఫ్‌ఆర్‌ఎస్'

- **పారదర్శకత ఉంటుంది : యోగితారాణా**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్‌ను విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ప్రారంభించారు. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకే ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తుండడం గమనార్హం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధానం ద్వారా విద్యాసంస్థల్లో పారదర్శకత ఉంటుందని చెప్పారు. ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మెరుగైన పాలనకు దోహదపడుతుందని అన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని వివరించారు. విద్యను మరింత సమర్థవంతంగా, డిజిటల్‌గా, విద్యార్థులకు అనుకూలంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను విజయవంతంగా అమలు చేయడంలో సహకరించాలని కోరారు. 1,64,621 మంది విద్యార్థుల్లో ఇప్పటివరకు 63,587 మంది విద్యార్థుల నమోదును పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన నమోదు పనులు సోమవారం నాటికి పూర్తవుతాయని వివరించారు.

సమస్యలపై ఉపాధ్యాయుల సమరభేరి

హైదరాబాద్‌లో మహాధర్నాకు వేలాది మంది టీచర్ల రాక



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఉపాధ్యాయులు సమరభేరి మోగించారు. సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ విమర్శించారు. ఇప్పటికే 20 నెలలు ఓపిక పట్టామని అన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించి రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయతను నిలుపుకోవాలని కోరారు. పరిష్కరించకుంటే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వేలాది మంది ఉపాధ్యాయులు తరలివచ్చారు. ఫ్లకార్డులను ప్రదర్శించారు. సమస్యలు పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ మహాధర్నాకు యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, సిహెచ్ అనిల్‌కుమార్, ఎం.సోమయ్య అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

న్యాయమైన డిమాండ్లు : కోదండరామ్

ఉపాధ్యాయులు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మహాధర్నా చేపట్టారని టిజెఎస్ అధినేత కోదండరామ్ అన్నారు. పెండింగ్ బిల్లులు, 317 జిఒ బాధితులకు న్యాయం చేయడం, ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన వంటి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. తొలుత ఆర్థికేతర సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు.

పరిస్థితి చేజారకముందే ప్రభుత్వం పరిష్కరించాలి : నాగేశ్వర్

ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు ఎక్కువ మంది గుమిగూడితే అది రాజకీయ మార్పునకు దారితీస్తుందని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ అన్నారు. పరిస్థితి చేజారకముందే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నేతలను పిలిచి మాట్లాడాలని సూచించారు. 33 జిల్లాలుంటే 12 డీఈవో పోస్టులనే ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 21 జిల్లాలకు డిఇఒ పోస్టుల్లేవని అన్నారు. 66 డిప్యూటీ ఇఒ పోస్టుల్లో రెగ్యులర్‌గా ఒక్కరూ పనిచేయడం లేదని చెప్పారు. 630 మండలాలుంటే రెగ్యులర్ ఎంఇఒలు 16 మందే ఉన్నారని వివరించారు. సిఎస్ లేకుంటే ఐఎఎస్‌లు పనిచేస్తారా?అని అడిగారు. పైరవీలు చేస్తే సమస్యలు పరిష్కారం కావని, ఉద్యమించాలని చెప్పారు. కెసిఆర్ ఓడిపోవడానికి 317 జీవో కూడా ఓ కారణమని అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఎందుకు చేరడం లేదో ఆలోచించాలన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలకు రూ.లక్షల ఫీజులు కట్టాల్సి వస్తోందని చెప్పారు.

నెలకు రూ.1,200 కోట్లు విడుదల చేయాలి : నర్సిరెడ్డి

ఈ-కుబేర్‌లో రూ.13 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వాటిని చెల్లించేందుకు ప్రభుత్వం నెలకు రూ.700 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిందనీ, అవి కూడా విడుదల చేయడం లేదన్నారు. పెండింగ్ బిల్లుల కోసం నెలకు రూ.1,200 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలను రూ.1.17 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. కానీ పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయడం లేదని అన్నారు. ఎన్‌ఇపి విద్యాప్రయివేటీకరణ కోసం తప్ప ప్రభుత్వ బడుల బాగుకోసం కాదన్నారు. అంతరాలు లేని విద్యను అందరికీ అందించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల్లో అసంతృప్తి : మారం జగదీశ్వర్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని ఉద్యోగ జెఎసి చైర్మెన్ మారం జగదీశ్వర్ అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వడం తప్ప ఇతర సమస్యలను పరిష్కరించలేదని చెప్పారు. 20 నెలలు ఆగామనీ, ఇంకా ఓపిక పట్టే పరిస్థితి లేదన్నారు. అందుకే అక్టోబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టామనీ, లక్ష మందితో ఎల్‌బి స్టేడియంలో భారీ సభను నిర్వహిస్తామని అన్నారు. ఉద్యోగ జెఎసి సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులను చలో హైదరాబాద్ కార్యక్రమానికి సన్నద్ధం చేసేందుకు వచ్చేనెల ఎనిమిది నుంచి 18 వరకు జిల్లాల్లో చైతన్య సదస్సులను నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గడం ఆందోళనకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎ.వెంకట్, ఎన్.తిరుపతి, టి.లింగారెడ్డి, కొమ్ము రమేష్, ఎస్ హరికిషన్, జాడి రాజన్న, బి కొండయ్య, వై విజయకుమార్, జాదవ్ వెంకట్రావు, మేడి చరణ్ దాస్, దూడ రాజనర్సు బాబు ప్రసంగించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు విమలక్క, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎల్ అరుణమ్మ పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్

- **మాజీ మంత్రి హరీశ్ రావు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు యూరియా సరఫరా చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్టుందని ఎద్దేవా చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టింది అబద్ధం కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంపిల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి ఆ పార్టీకి సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పరిపాలన చేయటమంటే బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదని ఎద్దేవా చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని, రైతులకు రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తు చేశారు.

షెల్ 'హెలిక్స్ అల్ట్రా' ఆవిష్కరణ

హైదరాబాద్ : చమురు కంపెనీ షెల్ ఇండియా తమ ప్రీమియం మోటార్ ఆయిల్ షెల్ హెలిక్స్ అల్ట్రాను 2025 ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది ఎపిఐ ఎస్‌క్యూ ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయబడిందని, కొత్త ప్యాకేజింగ్‌తో అందుబాటులోకి తెచ్చామని పేర్కొంది. ప్యూర్‌ప్లస్ టెక్నాలజీతో రూపొందిన ఈ ఆయిల్ 1.8 శాతం అధిక ఇంజిన్ శక్తి కలిగిన ఈ ఉత్పాదన దీర్ఘకాల ఇంజిన్ ఆరోగ్యాన్ని అందిస్తుందని షెల్ ఇండియా హెడ్ అమిత్ ఘుగ్రే తెలిపారు.

అబ్కారీ శాఖలో పెరుగుతున్న శిక్షలు

- **2022లో 1,379 ఎన్‌పిడిటి కేసులు నమోదు**
- **375 మందికి శిక్షలు ఖరారు**
- **ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేసుల నమోదు, శిక్షలంటే ఒకప్పుడు పోలీస్ శాఖనే గుర్తుకొచ్చేది. కాని నేడు ఆ బాధ్యతను అబ్కారీ శాఖ కూడా సమర్థవంతంగా నిర్వహిస్తోంది. 2021లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) చట్టం తర్వాత కేసుల నమోదు, శిక్షల ఖరారు శాతం ఎక్సైజ్ శాఖలో భారీగా పెరిగింది. కొత్త చట్టానికి తోడు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా, కల్తీ మద్యం తయారీ, అమ్మకాల కేసుల్లో శిక్షలు పడేలా చేయడంలో గణనీయమైన పురోగతి సాధించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం తెలంగాణలో దశాబ్ద కాలంలో అబ్కారీ నేరాల్లో శిక్షల ఖరారు రెండింతలు పెరిగింది. ఎక్సైజ్ శాఖ కేసుల్లో కూడా నిందితులకు ఐదేళ్లు, పదేళ్ల శిక్షలు, లక్షలాది రూపాయల జరిమానాలు పడుతున్నాయి. కేసు నమోదు నుంచి మొదలుకుని పంచానామా, చార్జీషీట్, సాక్ష్యుల వాంగ్మూలాలు నమోదు చేయడంలో తీసుకుంటున్న జాగ్రత్తలు శిక్షలు పడడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఎన్‌డిపిఎస్ కేసులు....

నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం 2022లో దేశంలో ఎన్‌పిడిఎస్ చట్టం కింద పంజాబ్‌లో 12,442, ఎపిలో 1,391, తెలంగాణలో 1,279 కేసులు నమోదయ్యాయి. పంజాబ్‌లో 132, ఎపిలో 325, తెలంగాణలో 365 మందికి శిక్షలు పడ్డాయి. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో శిక్ష ఖరారు దాదాపు 35 శాతంగా ఉంది.

2024లో 652 కేసుల్లో 997 మందిని అరెస్టు చేసి, 257 వాహనాలను సీజ్ చేశారు. 3,579 కిలోల గంజాయి, 446 గంజాయి మొక్కలను, 1.34 కేజీల హషీష్ ఆయిల్‌ను, 6.33 కేజీల ఒపిఎంను, 97 గ్రాముల ఎండిఎంఎను, 37 గ్రాముల ఎల్‌ఎస్‌డి బ్లాస్ట్‌ను, 8.47 కేజీల ఆల్ప్రోజోలంను పట్టుకున్నారు. 2025లో ఇప్పటి వరకు 880 కేసులు నమోదు చేసి 1,625 మందిని అరెస్టు చేసి 462 వాహనాలను సీజ్ చేశారు. 3,681 కిలోల గంజాయిని, 66.22 కేజీల గంజాయి చాక్లెట్లను, 43.66 గ్రాముల కొకైన్‌ను, 104.3 గ్రాముల హషీష్ ఆయిల్‌ను, 9.61 కేజీల ఆల్ప్రోజోలంను పట్టుకున్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ఎన్‌పిడిఎస్ చట్టం వచ్చిన తర్వాత సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యధికంగా 36 కేసుల్లో శిక్షలు పడ్డాయి.

పోలీస్ శిక్షణ....

ఎక్సైజ్ శాఖ అంటే మద్యం అమ్మకాలు, కల్తీ అరికట్టడంపైనే ఎక్కువ దృష్టి పెట్టేవారు. కాని తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పాలనాపరంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక మార్పులు తీసుకొచ్చారు. ఈ క్రమంలో అబ్కారీ శాఖను మరింత పటిష్టం చేసేందుకు వారికి పోలీస్ శిక్షణ అందించారు. పోలీస్ అకాడమీలో అబ్కారీ శాఖకు చెందిన 1,190 మంది అధికారుల నుంచి కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది వరకు శిక్షణ ఇచ్చారు. ఎన్‌పిడిఎస్ తర్ఫీదుతోపాటు చార్జీషీట్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంచానామా రాసే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులను పంచులగా చేర్చడం వంటి వాటిలో మెలకువలు నేర్పారు. ఫలితంగా గంజాయి, డ్రగ్స్, ఆల్ప్రోజోలం లాంటి మత్తు పదార్థాల కేసుల్లో శిక్షలు పడుతున్నాయని ఎక్సైజ్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

పనితీరుకు నిదర్శనం....


షానవాజ్ ఖాసిం, డైరెక్టర్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ఎక్సైజ్ శాఖలో నమోదవుతున్న కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతుండడం తమ శాఖ పనితీరుకు నిదర్శనం. కేసు నమోదు, పర్యవేక్షణకు సంబంధించి అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందికి పోలీస్ శిక్షణ అందించాం. పంచానామా, చార్జీషీట్, సాక్ష్యుల వాంగ్మూలాలు నమోదు చేయడంలో తీసుకుంటున్న జాగ్రత్తలతో నిందితులకు శిక్షలు పడుతున్నాయి.

మరింత నిబద్ధతతో పని చేస్తాం

జె.హరికిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, మెదక్

ఎక్సైజ్ నేరాల్లో కేసుల నమోదు, శిక్షలు పడేలా చేయడంలో రాష్ట్రంలో మెదక్ జిల్లా అగ్ర స్థానంలో ఉండటం మంచి పరిణామం, సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 600 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో వచ్చిన తీర్పులో ఒకరికి 20 సంవత్సరాలు, ఏడుగురికి 10 సంవత్సరాలు శిక్షలు పడ్డాయి. ఈ కేసులో వచ్చిన తీర్పు ఎక్సైజ్ సిబ్బందికి స్ఫూర్తి నిచ్చింది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధిస్తాం.



మీసేవా ఎంప్లాయీస్‌కు జీతాలు పెంచాలి

- **ఐటిఇసి, ఇండస్ట్రీస్ ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కు వినతి**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీసేవా ఉద్యోగులకు వెంటనే జీతాలు పెంచాలని తెలంగాణ మీసేవా ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీస్ ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్‌కు ఆ యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు ఆర్.సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవిబి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. మీసేవా సర్వీసుల్లో ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెడుతున్న అనేక సేవల వల్ల తమపై పనిభారం పెరుగుతుందని వాపోయారు.

ఈటివి నెట్‌వర్క్‌తో సామ్‌సంగ్ జట్టు

హైదరాబాద్ : ఈటివి నెట్‌వర్క్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సామ్‌సంగ్ టివి ప్లస్ పేర్కొంది.

ఇందులో భాగంగా ఈటివి న్యూస్, ఈటివి జోష్, ఈటివి మ్యూజిక్, ఈటివి కామెడీ ఛానెళ్లను తమ వేదికలో జోడించినట్లు సామ్‌సంగ్ టివి ప్లస్ పేర్కొంది. తద్వారా బలమైన 150కి పైగా ఛానెళ్లకు చేరినట్లయ్యిందని తెలిపింది.

యూరియా కోసం ఆందోళన

- **లైన్‌లో చెప్పులు, పాస్‌బుక్కులు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా దొరక్కపోవడంతో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని రైతు వేదిక వద్ద రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డి మండలం అల్వాల గ్రామ రైతు వేదిక వద్ద యూరియా వచ్చిందని తెలవడంతో, ఉదయం నాలుగు గంటల నుంచి రైతులు పాసుబుక్కులు లైన్లో పెట్టారు. కొంతమంది రైతులు ఖాళీ మద్యం సీసాలు పాస్‌బుక్‌లపై పెట్టి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రతి గ్రామంలోనూ మద్యం ఏరులై పారుతోంది కానీ.. రైతులు పండించే పంటకు యూరియా కావాలంటే మాత్రం దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులను రైతు వేదికలో నిర్బంధించి ఆందోళన చేశారు. ఒక్కసారిగా రైతులు యూరియా కోసం తోసుకురావడంతో పోలీసులకు రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాయపోలు మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలోనూ యూరియా కోసం రైతులు ఎక్కువ సేపు క్యూలో ఉండలేక చెప్పులను లైన్‌లో పెట్టారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో రైతు సేవాసహకార సంఘం దగ్గర యూరియా కోసం రైతులు ఉదయం నుంచి బారులు కట్టారు. చాలీచాలకుండా యూరియా రావడంతో తాండూర్-మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లిలో యూరియా కోసం రైతులు రోడెక్కారు. కొమరంభీం సెంటర్‌లో బైటాయించారు. రైతుల ఆందోళనకు సిపిఎం మండల కార్యదర్శి కె.నరేంద్ర మద్దతు తెలిపారు. కారేపల్లి ఎస్ఐ బైరు గోపి రైతులతో మాట్లాడి వారిని సముదాయించారు. అక్కడకు మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్‌కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. యూరియా కోసం ఉన్నతాధికారులతో మాట్లాడారు. 15 టన్నుల యూరియా ఆదివారం కారేపల్లి సొసైటీకి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎఒ తెలిపారు. దానిని ఆదివారమే పంపిణీ చేపడుతామని హామీ ఇచ్చారు.

మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

- **హైదరాబాద్ ఆర్థిక భవిష్యత్‌కు అదే పునాది**
- **ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ నదీ ప్రక్షాళన చేసి తీరుతామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఓ హోటళ్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటిపిఐ) తెలంగాణ స్టేట్ రీజినల్ చాప్టర్ ఆధ్వర్యంలో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఆర్థిక భవిష్యత్‌కు మూసీ ప్రక్షాళనే పునాదని పేర్కొన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదనీ, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమని నొక్కి చెప్పారు. మనం రూపొందించే విధానాలు, కాపాడే అడవులు, పునరుద్ధరించే నదులు, సృష్టించే ఉపాధి మొదలగు అభివృద్ధి పనులు తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం, కార్బన్ న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చని అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు, వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భజలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిపిఐ అధ్యక్షులు ఎన్‌కె.పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష, కో-ఆర్డినేటర్(టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటిపిఐ తెలంగాణ రీజినల్ చాప్టర్ చైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారును బద్నాం చేసే పనిలో బిజెపి, బిఆర్‌ఎస్

- **రాష్ట్రంలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కొరత**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును బద్నాం చేసేందుకు బిజెపి, బిఆర్‌ఎస్ కుట్ర పన్నుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి విమర్శించారు. వానాకాలానికి మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా షార్టేజ్ ఉందని తెలిపారు. కుట్రపూరితంగానే మోడీ సర్కారు యూరియా సప్లరు ఆపుతోందని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనూ యూరియా షార్టేజ్ ఉండేదని, అప్పుడు బిఆర్‌ఎస్ వైఫల్యంగా భావించాలా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు మాట్లాడి యూరియా తెప్పించాలని కోరారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా కొరత ఉన్న సమయంలో నల్లగొండ జిల్లాలో రేవంత్‌రెడ్డి పర్యటించి యూరియా కోసం రైతులు చెప్పులతో క్యూ కట్టిన ప్రాంతాన్ని సందర్శించారనీ, యూరియా కొరతకు కారణమని సాకులు చూపి బిఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఏడుగురు వ్యవసాయ శాఖ అధికారులను సస్పెండ్ చేసిన విషయం ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. మూడేళ్లలో వానాకాలానికి రాష్ట్రానికి అవసరమైన కోటా కన్నా తక్కువగానే కేంద్ర ప్రభుత్వం యూరియా పంపిందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ, రవాణా కోసం రైళ్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నారనీ, గతేడాది కన్నా ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందనీ, యూరియా కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నేడు పిఎసి, సలహా కమిటీల సమావేశం

- **తాజా రాజకీయ పరిణామాలపై చర్చ**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి), టిపిసిసి అడ్వయిజరీ కమిటీలు శనివారం సమావేశం కానున్నాయి. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర సభ్యులు హాజరుకానున్నారు. హైకోర్టు కోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చించనుంది. ముఖ్యంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు కేంద్రం అడ్డుపడుతున్న నేపథ్యంలో పార్టీ పరంగా ఎలాంటి కార్యాచరణ తీసుకోవాలనే విషయాన్ని చర్చించనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఎదుర్కొబోతోంది. ఇప్పటికే మంత్రులు ఆ నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. భవిష్యత్తులో ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలనే అంశాన్ని ఖరారు చేయనుంది. ఎఐసిసి పిలుపుమేరకు 'ఓట్ చోరీ, గద్దీ చోడ్' ఉద్యమాన్ని రాష్ట్రంలో విస్తృతంగా చేపట్టనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించింది. అంతేకాకుండా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, జిల్లా కమిటీలను నియమించేందుకు తగిన సూచనలు చేయనుంది. యూరియా కొరతపై బిఆర్‌ఎస్, బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కార్యాచరణ రూపొందించనుంది.

'యూరియా'పై ఆందోళన వద్దు

- **రైతులకు మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు విజ్ఞప్తి**
- **ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురికావొద్దని విజ్ఞప్తి చేశారు. వీలులైనంత త్వరగా యూరియా సమస్య తీరుతుందని హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై మంత్రులు ఆరా తీశారు. ఈ సీజన్‌లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పని చేయడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచుగా ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్‌ఎఫ్‌సిఎల్ సిఇఒ అలోక్ సింఘాల్‌ను వారు ప్రశ్నించారు. 'మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. రాష్ట్రాభివృద్ధిలో తమతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నాం' అని స్పష్టం చేశారు. ప్లాంటు పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దని కోరారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్‌ఎఫ్‌సిఎల్ మాతృసంస్థ ఎన్‌ఎఫ్‌ఎల్‌కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో కంపెనీకి ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్‌ఎఫ్‌సీఎల్ రామగుండం యూనిట్ జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్‌లో గణేష్ చతుర్థి తగ్గింపులు

బెంగళూరు : ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ ఇండియా ప్రత్యేకంగా గణేష్ చతుర్థి స్టోర్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ స్టోర్‌లో పర్యావరణ హితమైన బంకమట్టి గణేష విగ్రహాలు, చేతితో తయారు చేసిన అలంకరణలు, పండగ దుస్తులు, పూజా సామగ్రి, మిఠాయిలు లభిస్తాయని పేర్కొంది. ఈ పండగ ఉత్పత్తులపై 90 శాతం వరకు తగ్గింపును పొందొచ్చని తెలిపింది.